క్లుప్తంగా

ముగిసిన వెంకన్న జాతర



కుంకుమ పూజలు చేస్తున్న భక్తులు

పొందూరు: మండలంలోని తండ్యాం పంచాయతీ మన్నెపేట కొండపై గల అలివేలు మంగమ్మ పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి 32వ జాతర ఉత్సవాలు సోమవారంతో ముగిశాయి. చివరి రోజు అలివేలు మంగమ్మ, పద్మావతి అమ్మవార్లకు కుంకుమ పూజలు చేశారు. మధ్యాహ్నం తండ్యాం, ఎస్‌ఆర్‌ఎస్ కాలనీ, లక్ష్మీపురం, బొట్లపేట, జాడపేట, మన్నెపేట గ్రామాల ప్రజలు అన్నసమారాధనలో పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా తక్షణ సాయం అందజేత



బీమా మొత్తం అందజేస్తున్న రమణ, సచివాలయం సిబ్బంది

సరుబుజ్జిలి: రొట్టవలస గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో సురవరపు సూర్యనారాయణ మృతిచెందాడు. వైఎస్సార్ బీమా తక్షణ సహాయం కింద రూ.10వేల నగదును మృతిని భార్య చంద్రకళకు సోమవారం అందించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు మూడడ్ల రమణ, సచివాలయం సిబ్బంది ఉన్నారు.

ఎమ్మార్సీకి చేరిన విద్యా కానుక కిట్లు



ఎమ్మార్సీలో భద్రపస్తున్న నోట్ బుక్స్

సారవకోట: మండల కేంద్రంలోని ఎమ్మార్సీకి ఈ విద్యా సంవత్సరంలో విద్యార్థులకు అందించేందుకు జగనన్న విద్యా కానుక కిట్లు సోమవారం చేరాయి. ఇప్పటికే 16 వేల పాఠ్య పుస్తకాలు, రాగి జావ అందించేందుకు గ్లాసు వచ్చాయి. సోమవారం నోట్ బుక్స్, యూనిఫాం క్లాత్ ఎమ్మార్సీకి చేరింది. వీటిని ఎమ్మార్సీ సిబ్బంది గొడౌన్‌లో భద్రపర్చారు.

సంక్షేమం, అభివృద్ధే ధ్యేయం



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

మెళియాపుట్టి: సంక్షేమం, అభివృద్ధే ధ్యేయం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని జెడ్పీటీసీ గూడ ఎండయ్య, మండల వైఎస్సార్‌సీపీ నాయకుడు బైపోతు ఉదయ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. ఇటీవల నిర్వహించిన జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమానికి విశేష ప్రజాధారణ లభించిందన్నారు. పాతపట్నం నియోజకవర్గ సమస్యలను నేరుగా సీఎం జగన్ దృష్టికి ఎమ్మెల్యే రెడ్డి శాంతి తీసుకెళ్లి పరిష్కరిస్తున్నారు. తెలుగుదేశం నాయకుల మాయమాటలు ప్రజలు నమ్మరన్నారు. పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సీసీ కుటుంబానికి ఆర్థికసాయం



పాపాయమ్మ కుటుంబ సభ్యులు తక్షణ సహాయం అందజేస్తున్న పీడీ విద్యాసాగర్

నరసన్నపేట: వైఎస్సార్ క్రాంతి పథంలో గార మండలంలో సీసీగా పని చేస్తున్న కనపల పాపాయమ్మ కుటుంబాన్ని డీఆర్‌డీఏ పీడీ డీవీ విద్యాసాగర్ సోమవారం పరామర్శించారు. నరసన్నపేట మండలం పోతయ్యవలసకు చెందిన పాపాయమ్మ అనారోగ్యంతో మూడు రోజుల క్రితం మృతి చెందాచారు. సమాచారం తెలుసుకున్న పీడీ ఆమె కుటుంబ సభ్యులకు పరామర్శించి ధైర్యం చెప్పారు. ఆమె కుటుంబానికి జిల్లా సమాఖ్య తరఫున తక్షణ సహాయంగా రూ.25 వేలు అందించారు. వైఎస్సార్ క్రాంతి పథం సిబ్బంది ఆమె కుటుంబానికి అండగా ఉండాలని సూచించారు. వైఎస్సార్ క్రాంతి పథం ఏపీ కొండలరావు, స్త్రీనిధి మేనేజర్ నాగరాజు, ఏపీఎంలు సాయిలక్ష్మి, హేమసుందరరావు, వైఎస్సార్‌సీపీ నాయకుడు కనపల శేఖరరావు, తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

పాతపట్నం: పాతపట్నం ఏపీ ఆదర్శ పాఠశాలలో 2023–24 విద్యా సంవత్సరంలో 6వ తరగతి ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కె.వి.రత్నకుమారి సోమవారం తెలిపారు. 5వ తరగతి చదివిన విద్యార్థులు ఈ నెల 9వ తేదీ నుంచి 25వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. జూన్ 11న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రవేశ పరీక్ష ఫీజు ఎస్సీ, ఎస్టీలు రూ.75, ఓసీ, బీసీలు రూ.150 చెల్లించాల్సి ఉంటుందన్నారు. హెచ్‌టీటీపీఎస్:ఏపీఎంఎస్.ఏపీ.జీఓవీ.ఇన్‌కు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



సంక్షేమ పథకాలను వివరిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

- స్పీకర్ తమ్మినేని సీతారాం
- గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి విశేష స్పందన

బూర్జ: సంక్షేమం, అభివృద్ధికి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పెద్దపీట వేస్తున్నారని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలోని లాబాం, నారాయణపురం గ్రామాల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు ప్రజలకు వివరించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయా, లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఈ నాలుగేళ్లలో ప్రభుత్వం ద్వారా అందించిన సంక్షేమ పథకాల కరపత్రాలు లబ్ధిదారులకు అందజేశారు. ఎవరికైనా అర్హత ఉండి సంక్షేమ పతకాలు అందకపోతే సాంకేతిక కారణాలు అన్వేషించి, అర్హులైన వారికి పథకాలు వర్తించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రతీ గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలను నాడు–నేడు కార్యక్రమంలో భాగంగా అభివృద్ధి చేశామన్నారు. గ్రామాల్లో ప్రాథమిక చికిత్సలు అందించాలన ఉద్దేశంతో ఆరోగ్య కేంద్రాలు ప్రభుత్వం నెలకొల్పేలా చర్యలు చేపట్టిందన్నారు. ప్రతీ గ్రామంలో జల్‌జీవన్ మిషన్ ద్వారా తాగునీటి కల్పనకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. లాబాం గ్రామానికి రూ.69 లక్షలు, నారాయణపురం గ్రామానికి రూ.38 లక్షలు మంజూరు చేశామన్నారు. గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ ద్వారా పారదర్శకమైన, వేగవంతమైన సేవలు ప్రజలకు అందజేసస్తున్నామన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి పట్టం కట్టాలన్నారు. జెడ్పీటీసీ బెజ్జిపురపు రామారావు, ఎంపీడీఓ ఎం.రవీంద్రబాబు, తహసీల్దార్ ఎస్.రమణారావు, మండల ప్రత్యేక ఆహ్వానితులు కర్నేన నాగేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ మండల కమిటీ అధ్యక్షుడు ఖండాపు గోవిందరావు, వైస్ ఎంపీపీలు బుడుమూరు సూర్యారావు, కరణం కృష్ణమూర్తినాయుడు, డీసీఎంఎస్ డైరెక్టర్ జల్లు బలరాం నాయుడు, పీఏసీఎస్ అధ్యక్షుడు బగాది నారాయణమూర్తి, మండల ప్రధాన కార్యదర్శి ఇసాయి వెంకటరావు, మాజీ ఏఎంసీ చైర్మన్ గుమ్మడి రాంబాబు, పార్టీ నాయకులు బొడ్డేపల్లి నాగరాజు, తొత్తడి సురేష్, మామిడి శ్రీనివాసరావు, వి.గోవిందరావు, బెజ్జిపురపు ఫల్గుణరావు, బెజ్జిపురపు అప్పలనాయుడు, మీసాల గోవిందరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

సిరిమాను సిద్ధం



సిరిమానును సిద్ధం చేస్తున్న నిర్వాహకులు

జలుమూరు: జలుమూరులో ఆదిలక్ష్మి అమ్మవారి సిరిమాను ఉత్సవాలకు ఉజ్జిడి సిరిమాను సోమవారం సిద్ధం చేశారు. మంగళవారం ఉదయం ప్రారంభం కానున్న సిరిమాను ఉత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. అమ్మవారికి చల్లదనం కోసం పసుపు కుంకుమలతో ముర్రాటలు సమర్పించారు.

ట్రాఫిక్ మళ్లింపు ఇలా..

ఆదిలక్ష్మి అమ్మవారి పండగలకు బుధవారం ట్రాఫిక్ ఆంక్షలు విధించినట్లు ఎస్ఐ పి.పారినాయుడు సోమవారం తెలిపారు. ఉదయం నుంచి సాయంత్రం నాలుగు వరకు ఆర్టీసీ బస్సులను జలుమూరు గ్రామంలోకి ప్రవేశాన్ని రద్దు చేశామన్నారు. నరసన్నపేటతోపాటు వివిధ గ్రామాల నుంచి జలుమూరు వెళ్లాల్సిన వాహనాలను చల్లవానిపేట, జోనంకి, సుబ్రహ్మణ్యపురం మీదుగా బుడితి, కొమనాపల్లి, శ్రీముఖలింగం తదితర గ్రామాలకు వెళ్లేందుకు రూట్‌ను సిద్ధం చేశామన్నారు. మరో రూట్‌ను రాణ, పెద్దదూగాం తదితర గ్రామాలను కలుపుతూ కరవంజ మీదుగా పాగోడు నుంచి కొమనాపల్లి చేరేలా ఏర్పాటు చేశామన్నారు. ప్రజలు సహకరించాలని కోరారు.

610 మందికి వైద్య పరీక్షలు



నరసన్నపేట: రోగులకు తనిఖీలు చేస్తున్న వైద్యులు



ఆమదాలవలస రూరల్: వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ఆమదాలవలస రూరల్: సీజనల్ వ్యాధులపై ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు వై.అప్పలకొండ అన్నారు. మండలంలో కట్యాచార్యులపేట గ్రామంలో రాగోలు జెమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని సోమవారం నిర్వహించారు. 300 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం వల్ల సీజనల్ వ్యాధులకు దూరంగా ఉండవచ్చునని సూచించారు. వేడి ఆహార పదార్థాలు, సురక్షితమైన తాగునీటిని నిత్యం తీసుకుని ఆరోగ్య సూత్రాలు పాటించాలన్నారు. సర్పంచ్ ఎన్ని రామచంద్రరావు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

సత్యవరంలో..

నరసన్నపేట: మండలంలోని సత్యవరంలో సోమవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 310 మందికి తనిఖీలు చేపట్టి మందులు పంపిణీ చేశారు. ఈ వైద్య శిబిరాన్ని ఎంపీపీ ఆరంగి మురళి ప్రారంభించారు. కిమ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జెమ్స్ ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది తనిఖీలు చేసి మందులు అందజేశారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే అభివృద్ధి



మాట్లాడుతున్న ప్రసాదరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు

కొత్తూరు: సీఎం జగన్‌మోహన్ రెడ్డి సహకారంతో ఎమ్మెల్యే రెడ్డి శాంతి పాతపట్నం నియోజవర్గాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేశారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సారిపల్లి ప్రసాదరావు అన్నారు. కొత్తూరులో సోమవారం విలేకరులతో మాట్లాడారు. హిరమండలంలోని వంశధార రిజర్వాయర్ నుంచి పాతపట్నం నియోజవర్గంలోని ఐదు మండలాలకు తాగునీరు కల్పించేందుకు రూ.267 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. కొత్తూరు మండలంలోని పలు పంచాయతీలకు ఇంటింటికీ తాగునీటి కుళాయిల ఏర్పాటు కోసం కోట్లాది రూపాయల నిధులు మంజూరు చేసినట్లు గుర్తుచేశారు. మెట్టూరు పీహెచ్‌సీ నిర్మాణానికి రూ.మూడు కోట్లు నిధులు మంజూరయ్యాయన్నారు. కొత్తూరు పోలీస్ స్టేషన్, సర్కిల్ కార్యాలయాలకు సుమారు రూ.మూడు కోట్లు కేటాయించి పనులు పూర్తిచేయించిన ఘనత ఎమ్మెల్యేకు దక్కిందన్నారు. అడ్డంగి, గొట్టిపల్లి, అభలాసింగి, అల్తి తదితర గిరిజన గ్రామాలకు ఐటీడీఏ ద్వారా కోట్లాది రూపాయలు కేటాయించినట్లు చెప్పారు. వంశధార నిర్వాసితులకు రూ.216 కోట్ల అదనపు పరిహారం పంపిణీ చేశామన్నారు. ఎమ్మెల్యే చొరవతో మండలంలోని పలు అభివృద్ధి పనులు చురుగ్గా సాగుతున్నాయని తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకులు వనము లక్ష్మీనారాయణ, ఎం.చక్రపాణి, లోతుగెడ్డ తిరుపతిరావు, బూర్లె శ్రీనివాసరావు, ఎస్.తిరుపతిరావు, గండివలస ఆనందరావు, పంకజ కుమార్‌దాస్, బి.రామకృష్ణ, పి.కృష్ణారావు, భాస్కరరావు పాల్గొన్నారు.

నిధుల దుర్వినియోగంపై ఫిర్యాదు



జేసీకి వినతిపత్రం అందజేస్తున్న బూర్లె శ్రీనివాసరావు

కొత్తూరు: మండలంలోని మెట్టూరు బిట్–1 ఆర్‌ఆర్ కాలనీ సర్పంచ్ అడపాక శంకరరావుపై సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందనలో జేసీ నవీన్‌కుమార్‌కు వైఎస్సార్‌సీపీ నాయకుడు బూర్లె శ్రీనివాసరావు ఫిర్యాదు అందించారు. పంచాయతీలో తన సొంత నిధులతో తాగునీటి బోరు, రచ్చబండ, సిమెంట్ కాలువలు నిర్మించానని శ్రీనివాసరావు తెలిపారు. ఈ నిర్మాణాలపై పంచాయతీ నిధులు సుమారు రూ.2.50 లక్షలు అక్రమంగా బిల్లులు చేయించుకున్న సర్పంచ్ శంకరరావుపై చర్యలు తీసుకోవాలన్నారు.

ఓంద్రుజోలలో..

ఓంద్రుజోల గ్రామంలోని సర్వే నంబర్ 23లో ఉన్న భూమిని అదే గ్రామానికి చెందిన ఆర్.తిరుపతిరావు తప్పుడు పొజిషన్ సృష్టించి ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు జిల్లా కలెక్టరేట్ నిర్వహించిన స్పందనలో బుడ్డు త్రినాథ్, సింహాద్రితో పాటు పలువురు ఫిర్యాదు చేశారు. తిరుపతిరావు పొజిషన్ చేయించుకున్న భూమి తరాల నుంచి మేకుల శాలలుగా ఉపయోగిస్తున్నామని ఫిర్యాదుదాలు తెలిపారు. తప్పుడు పొజిషన్ ఇచ్చిన రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు.

గూనభద్ర ఆర్‌ఆర్ కాలనీలో...

గూనభద్ర ఆర్‌ఆర్ కాలనీ పంచాయతీ పరిధిలోని నివాసం ఉంటున్న గదబపేటకు చెందిన నిర్వాసితులకు సంకిలి కొండపై సాగు చేస్తున్న భూములకు పట్టాలు మంజూరు చేయాలని సర్పంచ్ సాధుబాబుతోపాటు నిర్వాసితులు సీతంపేట ఐటీడీఏ పీఓకు వినతిపత్రం అందజేశారు. సాగు చేస్తున్న భూమికి సర్వే పూర్తిచేసినట్లు వినతిలో పేర్కొన్నారు.

38 మద్యం సీసాలు స్వాధీనం

- నలుగురిపై కేసు నమోదు

పాతపట్నం: ఒడిశా నుంచి అక్రమంగా మద్యం తీసుకువస్తున్న నలుగురు వ్యక్తులను పట్టుకుని కేసులు నమోదు చేశామని ఎస్ఐ ఎస్.కామేశ్వరరావు సోమవారం తెలిపారు. పర్లాకిమిడి నుంచి 38 మద్యం సీసాలను తీసుకువస్తుండగా పాతపట్నం చెక్‌పోస్ట్ వద్ద పోలీసులు పట్టుకున్నారు. వీటి ధర రూ.8,840 ఉంటుందని ఎస్ఐ తెలిపారు.

పెచ్చులూడిన పైకప్పు



టేబుల్‌పై పడిన పెచ్చులు

సారవకోట: మండల కేంద్రంలోని ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం పైకప్పు సోమవారం పెచ్చులూడి పడి పోయింది. ముగ్గురు అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు భోజనాలు చేస్తుండగా ఒక్కసారి పెచ్చులూడి పడి పోవడంతో భయాందోళన చెందారు. ఎవరిపైనా పడకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. 1993లో నిర్మించిన భవనం కావడంతో ఎప్పటికప్పుడు పెచ్చులూడి పడిపోతుంది. నిర్మించిన తరువాత ఒక్కసారి కూడా మరమ్మతులు చేయకపోవడంతో ఇటువంటి సమస్యలు ఎదురవుతున్నాయని సిబ్బంది తెలిపారు.

వేసవి శిక్షణ శిబిరం ప్రారంభం

పొందూరు: పౌర గ్రంథాలయ శాఖ ఆదేశాల మేరకు స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరం సోమవారం ప్రారంభమైంది. ఈ నెల 8 నుంచి వచ్చేనెల 11 వరకు జరగనున్న వేసవి శిక్షణ శిబిరాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయాధికారి భాస్కరరాజా కోరారు. విద్య, విజ్ఞానం, ఆహారం, ఆరోగ్యం, పోటీ పరీక్షల పుస్తకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. జూనియర్ లెక్చరర్ శ్రీనివాసరావు, ఉపాధ్యాయుడు రాజేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణాలు పూర్తిచేయాలి

జలుమూరు: సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు వెంటనే పూర్తిచేయాలని ఎంపీపీ వాన గోపి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సోమవారం సమావేశం నిర్వహించారు. గృహ నిర్మాణాలకు సంబంధించి జగనన్న కాలనీలు పూర్తి చేసేందుకు సిబ్బంది సమీక్షలు నిర్వహించాలన్నారు. పెండింగ్ బిల్లులు మంజూరయ్యేలా చూడాలని అధికారులను సూచించారు. జేఈ శ్రీధర్, గృహనిర్మాణ శాఖ ఏఈ గోపీకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

జలుమూరు: జలుమూరులోని ఆదిలక్ష్మి అమ్మవారి సిరిమాను ఉత్సవాలు సందర్భంగా మంగళవారం మధ్యాహ్నం మూడు గంటలకు సిరిమాను ఊరేగింపు సమయంలో విద్యుత్‌ను నిలిపివేయనున్నామని ఏఈ వారణాసి వెంకటేశ్వరరావు సోమవారం తెలిపారు. జలుమూరు ఫీడర్ పరిధిలో గల సుబ్రహ్మణ్యపురం, నామాలపేట, కోన సింహాద్రిపేట గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. ఉత్సవం అనంతరం విద్యుత్ పునరుద్ధరణ చేస్తామన్నారు.

మహిళపై గుర్తుతెలియని వ్యక్తుల దాడి



గాయపడిన కృష్ణవేణి

నరసన్నపేట: మండలంలోని జమ్ము సమీపంలో గల కొల్లవాని చెరువు వద్ద టిఫిన్ షాపు నిర్వాహకురాలు గెంబలి కృష్ణవేణిపై సోమవారం వేకువజామున గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేశారు. అపస్మారక స్థితిలో ఉన్న కృష్ణవేణిని నరసన్నపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఇక్కడ నుంచి శ్రీకాకుళం రిమ్స్‌కు సోమవారం రాత్రి తీసుకెళ్లారు. టిఫిన్ షాపులో పనులు చేసేందుకు ఇంటి నుంచి కృష్ణవేణి బయటకు రాగా.. ఓ వ్యక్తి తలపై కర్రతో గాయపరిచినట్లు భర్త భీమారావు తెలిపారు. మరోవ్యక్తి ద్విచక్ర వాహనంతో రోడ్డుపై ఉన్నాడని, కృష్ణవేణి కింద పడిన వెంటనే ఇద్దరూ వెళ్లిపోయారని తెలిపారు. ఈ దాడి దొంగలే చేసి ఉంటారని భీమారావు అనుమానం వ్యక్తం చేశారు. ఆమె మెడలో పసుపుతాడే ఉందని, ఎటువంటి బంగారు అభరణాలు లేవన్నారు. ఈ సంఘటనపై నరసన్నపేట ఎస్ఐ వద్ద ప్రస్తావించగా.. ఆస్పత్రికి వెళ్లి వివరాలు సేకరించామని, కేసు నమోదు చేయలేదన్నారు.

విద్యార్థులకు అభినందన



సారవకోట: 500 మార్కులు పైబడిన విద్యార్థులతో అధికారులు



నరసన్నపేట: అభిషేక్‌ను అభినందిస్తున్న ఉపాధ్యాయులు



ఆమదాలవలస: ఉత్తమ మార్కులు పొందిన విద్యార్థులను అభినందిస్తున్న చిరంజీవినాగ్

సారవకోట: మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో 10వ తరగతి ఫలితాలలో 500 మార్కులు పైబడిన విద్యార్థులను సోమవారం అధికారులు అభినందించారు. ఈ పాఠశాలకు చెందిన ఉర్లాన జాహ్నవి 590 మార్కులు సాధించింది. మరో 15 మంది విద్యార్థినులు 500 పైబడి మార్కులు సాధించారు. జిల్లా జీసీడీఓ ఎస్.నీరజ, ఎంపీడీఓ విశ్వేశ్వరరావు, ఎంఈఓ ఎం.వి.రమణ, ఎస్ఓ శిరీష, సిబ్బంది అభినందించారు.

సరుబుజ్జిలి: రొట్టవలస హైస్కూల్ విద్యార్థిని గేదెల రోజారమణి 573 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచింది. సోమవారం విద్యాశాఖ బృందం బాలిక గ్రామం కొండవలస వెళ్లి అభినందించారు. ఎంఈఓ డి.బాలరాజు, ఎంఐఎస్ కోఆర్డినేటర్ పైడి మురళీకృష్ణ, సీఆర్పీలు చిన్నారావు, రామినాయుడు, రోహిణి, క్రాఫ్ట్ ఇన్‌స్ట్రక్టర్లు, ఎమ్మార్సీ సిబ్బంది పాల్గొన్నారు.

నరసన్నపేట: నరసన్నపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన ముచ్చ అభిషేక్ 580 మార్కులు సాధించాడు. పాఠశాల హెచ్‌ఎం వెంకటరావు ఆధ్వర్యంలో సోమవారం ఉపాధ్యాయులందరూ అభిషేక్ ఇంటికి వెళ్లి అభినందించారు. ఉపాధ్యాయులు సాయి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

పాతపట్నం: పాతపట్నం ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన మిట్టు మహాపాత్రో 594 మార్కులు సాధించారు. ఎన్ఆర్ఐ (లండన్) దవళ వెంకట గిరి బాబు విద్యార్థిని అభినందించారు. సోమవారం మిట్టు ఇంటికి వెళ్లి పిడుగు ఇందిర చేతులమీదుగా రూ.5 వేలు ఆర్థిక సహాయం అందించారు. ఉపాధ్యాయులు భీమ్‌సేన్ పండా, శ్రీదేవి, సూర్యనారాయణ బరోడా, బృందావతి తదితరులు పాల్గొన్నారు.

ఆమదాలవలస: ప్రగతి పథంలో ప్రభుత్వ పాఠశాలలు పయనిస్తున్నాయని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగ ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవి నాగ్ అన్నారు. పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను సోమవారం స్థానిక లక్ష్మీనగర్ మున్సిపల్ హైస్కూల్లో సంబంధిత అధికారులతో కలిసి అభినందించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వ విద్యారంగానికి పెట్టపీట వేశారన్నారు. 256 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 204 మంది విద్యార్థులు ఉత్తీర్ణులు అయ్యారన్నారు. వీరిలో పేడాడ షణ్ముఖ నివాస్ 591 మార్కులు సాధించి ప్రభుత్వ యాజమాన్యాల విద్యా సంస్థల్లో రాష్ట్ర స్థాయిలో రెండో ర్యాంకు సాధించడం గొప్ప విషయమన్నారు. పి.రాకేష్ 589 మార్కులు, ఎం.సంజయ్, ఎం.అమృత 588 మార్కులు సాధించారన్నారు. 26 మంది విద్యార్థులు 550 మార్కులు దాటిన వారిలో ఉన్నారన్నారు. టెక్కలి ఉపవిద్యాధికారి పగడాలమ్మ, పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ అలీ ఖాన్, డీసీసీబీ సెక్రటరీ గెడ్డాపు రాజేంద్రప్రసాద్, ఆముదాలవలస ఎంఈఓ డి.రామారావు, ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పేడాడ ప్రభాకరరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు అల్లం శెట్టి ఉమామహేశ్వరరావు, దుంపల శ్యామలరావు, జె.కె.వెంకబాబు, పొడుగు శ్రీనివాసరావు, హెచ్‌ఎం బొడ్డేపల్లి రామకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సరుబుజ్జిలి: రోజారమణిని అభినందిస్తున్న ఎంఈఓ బాలరాజు



పాతపట్నం: మిట్టుకు ఆర్థిక సహాయం అందజేస్తున్న ఇందిర

ప్రతి సంఘానికీ జీవనోపాధి యూనిట్



మాట్లాడుతున్న ఏపీఎం కూర్మారావు

ఆమదాలవలస రూరల్: గ్రామీణ స్వయం శక్తి సంఘాల్లో మహిళలు తీసుకున్న రుణాల నుంచి ప్రతీ పొదుపు సంఘంలో ఒక జీవనోపాధి యూనిట్ ఏర్పాటు చేసే లక్ష్యాన్ని అమలు చేయాలని వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం పైడి కూర్మారావు తెలిపారు. స్థానిక మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో అధ్యక్షురాలు తమ్మినేని ధనలక్ష్మి ఆధ్వర్యంలో లోకోస్ యాప్ శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొదుపు సంఘాల్లో వాడుకుంటున్న అప్పులను ఆదాయాభివృద్ధికి ఉపయోగించాలని సూచించారు. పిల్లల చదువులతో పాటు కుటుంబ జీవనోపాధులను మెరుగుపరుచుకోవడానికి ఉపయోగించాలన్నారు. తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకుని సకాలంలో తిరిగి చెల్లించాలన్నారు. 18 నుంచి 50 సంవత్సరాల వయస్సు గల మహిళలంతా పీఎంజేబీవైలో, 70 సంవత్సరాల లోపు మహిళలంతా సురక్ష బీమా యోజనలో నమోదు అయ్యేలా సిబ్బంది పని చేయాలని ఆదేశించారు. క్లస్టర్ కో ఆర్డినేటర్లు, గ్రామ సంఘాల వీఓఏలు పాల్గొన్నారు.

ఇంటి వద్దకే ఫ్యామిలీ డాక్టర్

కొత్తూరు: మండలంలోని ఇరపాడు గూడలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. 104 వాహనం ద్వారా ఉచిత వైద్య శిబిరాన్ని సర్పంచ్ సవర ఫల్గుణరావు ప్రారంభించారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామాల్లో దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న రోగులు, గర్భిణులకు సకాలంలో వైద్యం అందుతుందన్నారు. 82 మందికి వైద్యాధికారి కె.రాంబాబు వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్య సిబ్బంది కె.ప్రవల్లిక, సుధారాణి, కృష్ణవేణి, తేజేశ్వరరావు, కె.వెంకటేష్ వైద్య సేవలు అందించారు.

పాతపట్నం: మండలంలోని రొంపివలస గ్రామంలోని ఎంపీపీ పాఠశాల వద్ద బైదలాపురం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 302 మందికి వైద్యుడు ఐ.శ్రీధర్ వైద్య సేవలు అందించి, అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. బాబూరావు, ఏఎన్‌ఎంలు, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే అభివృద్ధి సాధ్యం



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పాతపట్నం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోనే ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని వైస్ ఎంపీపీ ఎస్ ప్రదీప్, సచివాలయ మండల కన్వీనర్ వై.సూర్యం అన్నారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. అర్హత ఉన్న ప్రతీ కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. పాతపట్నం నియోజకవర్గంలో ఇంటింటికీ తాగునీటి కోసం రూ.265 కోట్లు నిధులు, కాగువాడ–రొంపివలస వంతన నిర్మాణం చేపట్టడంతోపాటు పలు అభివృద్ధి పనులు చేసిన ఘనత వైఎస్సార్‌సీ ప్రభుత్వదేనన్నారు. నూలు ఈశ్వరరావు, బి.నారాయణమూర్తి, శిష్ఠు తులసీనాయుడు, ప్రహల్లాద పుల్లాయ్, చీకటి పద్మరాజు, మాధవరావు పాల్గొన్నారు.

విజ్ఞాన శిబిరాలు సద్వినియోగం చేసుకోవాలి



కొత్తూరు: మాట్లాడుతున్న సర్పంచ్ పడాల కృష్ణవేణి

కొత్తూరు: వేసవి సెలవుల్లో విద్యార్థుల ప్రయోజనం కోసం ప్రభుత్వం ఈ నెల 8 నుంచి జూన్ 11వ తేదీ వరకు నిర్వహిస్తున్న విజ్ఞాన శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కొత్తూరు సర్పంచ్ పడాల కృష్ణవేణి కోరారు. కొత్తూరు శాఖా గ్రంథాలయంలో సోమవారం వేసవి విజ్ఞాన శిబిరాన్ని ప్రారంభించారు. ఇటువంటి శిబిరాలకు విద్యార్థులు హాజరై సృజనాత్మకత పొందించుకోవాలన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రంథాలయాధికారి, సిబ్బంది పాల్గొన్నారు.

పాతపట్నం: గ్రంథాలయాలను పాఠకులు, విద్యార్థులు వినియోగించుకొని జ్ఞానాన్ని సంపాదించుకోవాలని సీఐ ఎం.వినోద్‌బాబు అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాన్ని సోమవారం ప్రారంభించారు. ఎస్ఐ ఎస్.కామేశ్వరరావు, గ్రంథాలయాధికారి కాళ్ల రాజు, వై.రామారావు, వెంకట్, శ్యామ్‌బాబు, మల్లేశ్వరరావు, శోభన్‌బాబు, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.